న్యూజెర్సీ కథల పోటీల్లో ఉత్తమంగా ఎంపికై
రూ. 1000 గెల్చుకున్న కథ

# బాధ్యత

"ఏవండీ"

నా భార్య పిలుపుతో మ్యాగజైను తిరగేస్తున్న నేను ఆమె వైపు తిరిగి "ఏమిటి?" అన్నాను.

స్నానం చేసి తీరిగ్గా కూర్చుని మ్యాగజైను చూస్తుంటే, నా భార్య 'ఏవండీ' అంటూ పిలవడం నాకు విసుగనిపించింది.

"మీ నాన్న దగ్గర నుంచి మీకు ఉత్తరం వచ్చింది."

అప్పటిదాకా నాలో వున్న నిరాసక్తత ఆమె అన్న మాటలతో పటాపంచలైపోయింది. భార్య చేతిలో వున్న ఉత్తరం తీసుకున్నాను. ఆ ఉత్తరం ఆసక్తితో చదవసాగాను.

శశిధర్‌కు,

నాన్న ఆశీర్వదించి వ్రాయునది. నేను ఇక్కడ క్షేమం. నీవు అక్కడ క్షేమంగా వున్నావని తలుస్తాను. గత కొంత కాలంగా మీ అమ్మ ఆరోగ్యం బాగుండడంలేదని నీకు తెలుసు. నేను మీ అమ్మను డాక్టర్‌కు చూపించాను. డాక్టర్ పరీక్షలన్నీ చేసి, మీ అమ్మకు ఏదో గుండెజబ్బు వుందని చెప్పారు.

ఆపరేషన్ చేయాలన్నారు. హాస్పిటల్‌లో చేర్పడం, ఆపరేషన్ చేయించడం వంటి ఖర్చులన్నీ కలిపి లక్ష రూపాయల దాకా అవుతాయి. నేను నిన్ను డబ్బు అడగడంలేదు. నువ్వు ఈ ఊరు వస్తే మీ అమ్మకు 'కొడుకు దగ్గర వున్నాడు' అనే ధైర్యం వుంటుంది. మీ అమ్మ కూడా నిన్ను చూడాలని అంటోంది. కాబట్టి నువ్వు వీలు చూసుకుని ఈ ఊరు వస్తే బావుంటుంది. నువ్వు డబ్బు తేవక్కరలేదు.

ఇట్లు
నాన్న

ఉత్తరం చదివాక నాలో స్తబ్దత ఆవరించుకుంది. సోఫాలో కొద్దిసేపు మౌనంగా కూర్చుండిపోయాను. నా భార్య వంటింట్లోకి వెళ్ళడం కూడా నేను గమనించలేకపోయాను.

"నువ్వు డబ్బు తేవక్కరలేదు. నువ్వు వస్తే చాలు" అన్న దానిలో మా నాన్నకు నా పట్ల వున్న అభిప్రాయం అర్థమవుతోంది. కానీ అందులో ఆయన తప్పు లేదు.

నేను ఇప్పుడు ఒక కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్నాను. నెలకు నాకు వచ్చే జీతం ఎక్కువే. రెండు సంవత్సరాల క్రితమే పెద్ద ఇల్లు కట్టించాను. నాకు లక్ష రూపాయలు సర్దడమంటే పెద్ద సమస్య కాదు. మా నాన్నకు నా మీద వున్న అభిప్రాయాన్ని తలుచుకుంటేనే బాధ కలుగుతోంది. అయితే ఆయనకు ఆ అభిప్రాయం వుండడంలో ఆశ్చర్యం లేదు.

నాకు గుంటూరులో బ్యాంక్‌లో బ్యాలెన్స్ వుంది. మా అమ్మ, నాన్న వుండేది గుంటూరులోనే కాబట్టి నేను వెళ్ళాక డబ్బు తీసుకోవచ్చు.

నేను రేపు రాత్రి గుంటూరు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

ఇలా ఆలోచించుకున్నాక కొంచెం స్థిమితపడ్డాను.

నా భార్య వంటింట్లో నుంచి వచ్చింది. "ఏం చేయదలుచుకున్నారండీ?" అంటూ నన్ను ప్రశ్నించింది.

నా నిర్ణయం గురించి చెప్పాను.

"ఏమండీ మీరు ఏమీ అనుకోనంటే మీకొక

పి.వి.శ్రీనివాసమూర్తి

సలహా ఏదైనా" నా శ్రుతి నాతో అంది.

"చెప్పు" నేను అన్నాను.

"మీరు ఏమీ అనరుగా"

"ఏమీ అనను." ఆమె ఆ ఉత్తరం గురించే ఏదో మాట్లాడుతోందని అర్థమవుతోంది. తరువాత ఆమె ఇంకా ఎన్నాళ్ళు బ్రతుకుతుంది. కాబట్టి మీకేమీ మీ అమ్మకు సహాయం చేయక్కరలేదు. ఆ డబ్బును మరొకదానికి వినియోగించుకోవచ్చు. అంతేగానీ అనవసరంగా ఖర్చు చేయకండి" చెప్పడం ఆపి నావైపు చూసింది.

నేను మౌనంగా వుండిపోయాను.

నా మౌనాన్ని చూసి నా భార్య "ఏమిటి? ఏం మాట్లాడరు?" అంది.

"ఆ విషయాలు నేను చూసుకుంటానులే" అని ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాను.

"ఏమిటి ఈ మనుషులు. చిన్నప్పటి నుంచి తమను పెంచి పోషించిన తల్లిదండ్రుల పట్ల ప్రవర్తించాల్సిన పద్ధతి ఇదేనా?" అనుకునే అర్హత నాకు లేదేమో.

నా మనసంతా అల్లకల్లోలంగా వుండడంతో ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు.

* * *

నేను మా కంపెనీ మేనేజర్‌ను ఒక వారం రోజులు సెలవు కావాలని అడిగాను. ఆయన నాకు సెలవు మంజూరు చేశారు.

రాత్రి ఏడయ్యాక నా మిత్రుడు శ్రీహరి ఇంటికి వెళ్ళాను. మా నాన్న వ్రాసిన ఉత్తరం గురించి చెప్పాను. అది విన్నాక "అయితే ఏం చేద్దామనుకుంటున్నావు?" అన్నాడు.

"ఈరోజు రాత్రి మా ఊరు వెళదామనుకుంటున్నాను" నేను చెప్పాను.

"వెళ్ళు. కానీ ఈ డబ్బు గురించి ఏమీ ఆలోచించకు. అన్నీ మీ నాన్న చూసుకుంటారు. మధ్యలో నువ్వు ఇరుక్కోకు. నీకూ పెళ్ళీడుకు వచ్చిన కూతురు వుంది" అన్నాడు శ్రీహరి.

నేను చిరునవ్వు నవ్వాను.

మరొక పది నిముషాల తరువాత నేను మా ఇంటికి వచ్చేశాను.

రాత్రి తొమ్మిదింటికి మా ఊరు వెళ్ళే రైలు ఎక్కాను. జనాలు ఎక్కువగా లేకపోవడంతో కిటికీ పక్కన కూర్చునే అవకాశం లభించింది.

రైలు వేగంగా ప్రయాణిస్తోంది. నా ఆలోచనలు అంతకన్నా వేగంగా సాగుతున్నాయి.

మాది ఒక మధ్యతరగతి కుటుంబం. నా తల్లిదండ్రులకు ఒక కూతురు తరువాత కలిగిన సంతానం నేను. అక్క నాకన్నా మూడు సంవత్సరాలు పెద్ద. నాకు ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. జీతం తప్ప పై సంపాదనలు లేని మా నాన్న డబ్బు కోసం వెనకాడకుండా నన్ను ఇంజనీరింగ్ చదివించారు. ఇంజనీరింగ్ చదివాక నాకు తొందరగానే ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు నేను మంచి పొజిషన్‌లోనే వున్నాను. దీనికి కారణం అప్పుడు మా నాన్న నన్ను ఇంజనీరింగ్ చదివించడమే. అందుకు నేను ఆయన పట్ల ఎంతో కృతజ్ఞతను ప్రదర్శించాలి. కానీ నేను ఆయన పట్ల కృతజ్ఞతతో వున్నానా?

మా నాన్న దాదాపు పద్నాలుగేళ్ళ క్రితం రిటైరయ్యారు. అప్పటికి నా వయస్సు ముప్పై రెండు సంవత్సరాలు. అప్పట్లోనే నాకు నెలకు పది వేలు వచ్చేది. మా నాన్నకు గుంటూరులో ఒక సొంత ఇల్లు వుంది. నాన్న రిటైరయ్యాక అమ్మ, నాన్న అక్కడే వుంటున్నారు. ఒకసారి నేను గుంటూరు వెళ్ళాను. అప్పుడు మా నాన్న నాతో 'ఒరేయ్. మాకు ఇక్కడ డబ్బు ఇబ్బందిగా వుంది. నెలకు కొంత డబ్బు పంపించరా' అని నోరుతెరచి అడిగారు.

ఎంతో కష్టపడి పెంచిన తండ్రి నన్ను అడిగారు అని ఆలోచించకుండా వెంటనే 'నాన్నా. నాకూ పిల్లలు వున్నారు. మేము వుండేది పట్టణంలో. అక్కడ ఖర్చులు ఎక్కువ. డబ్బు పంపించడం కుదరదు నాన్నా' అనేశాను. అంతే, తరువాత నాన్న ఒక్క పైసా కూడా అడుగలేదు.

డబ్బు అవసరం వచ్చినా కూడా నన్ను అడుగలేదంటే నాన్నకు వున్న ఆత్మాభిమానం అర్థమవుతోంది. తరువాత నేను అలా ఎందుకు అన్నాను అని బాధపడుతూనే వున్నాను. నేను కృతఘ్నుడిని. నేను ఆరోజు అలా ప్రవర్తించి వుండవలసింది కాదు. నాన్న నాకు పెట్టిన దానితో పోలిస్తే, నన్ను అడిగింది చాలా తక్కువ. ఇదేమీ ఆలోచించకుండా నేను కృతఘ్నుడిలా ప్రవర్తించాను.


రైలులో కిటికీ పక్కనే కూర్చోవడంతో చల్లని గాలి వీస్తోంది. ఆలోచనలతో నాకు నిద్రపట్టడంలేదు.

రెండు నెలల ముందే అమ్మకు అనారోగ్యంగా వుందని తెలియడంతో అప్పుడు గుంటూరు వెళ్ళి వచ్చాను. మా నాన్న, నన్ను రమ్మని ఉత్తరం వ్రాయడంతో మరలా ఇప్పుడు వెళుతున్నాను.

నాకు ఇప్పటికీ ఒక ప్రశ్నకు జవాబు దొరకడంలేదు. చిన్నప్పటి నుంచి తమను పోషించిన తల్లిదండ్రుల పట్ల కొంతమంది ఎందుకు చెడుగా ప్రవర్తిస్తున్నారు? ఆ చెడుగా ప్రవర్తించే వాళ్ళల్లో నేను వున్నాను. కానీ ఎందుకు అలా ప్రవర్తిస్తున్నారు?

నా భార్య మాటల ద్వారా కానీ, నా మిత్రుడు శ్రీహరి మాటల ద్వారా కానీ అర్థమయ్యేదేమిటంటే తల్లిదండ్రులు పెద్ద వాళ్ళయ్యాక, వాళ్ళకు చేసే ఖర్చు అనవసరమని. కానీ పిల్లలను పోషించే సమయంలో, తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసే ఖర్చు అనవసరమని భావిస్తున్నారా. లేదు. మరి అటువంటప్పుడు కొంతమంది పిల్లలు పెద్ద వాళ్ళయ్యాక తమ తల్లిదండ్రుల పట్ల చెడుగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?

మిగిలిన వాళ్ళ విషయం వదిలేసినా, కష్టపడి నన్ను చదివించిన మా నాన్న 'నెలకు కొంత డబ్బు పంపుతూ వుండు' అంటే నేను వెంటనే 'కుదరదు' అని ఎలా



చెప్పాను. నాకు ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ సీటు వచ్చినప్పుడు, మా నాన్న 'ప్రైవేటు కాలేజీలో చదివించడం కుదరదు' అని వుంటే ఎలా వుండేది?

నాకు ఎడతెరిపి లేకుండా ఆలోచనలు వస్తూనే వున్నాయి. ఈ ఆలోచనలతో ఎప్పుడు నిద్రపోయానో కానీ మళ్ళీ తెల్లవారు జామున మూడింటికి మెలకువ వచ్చింది.

రైలు మా ఊరును చేరుకోవడానికి ఇంకా అరగంట పడుతుంది. బయట అంతా నా మనసులాగానే చీకటిగా వుంది.

మరో అరగంటలో రైలు మా ఊరును చేరుకుంది.

నేను నా సూట్‌కేసు తీసుకుని రైలు దిగాను. అక్కడి నుంచి ఆటోలో మా ఇల్లు చేరుకునేసరికి



మరో పది నిముషాలు పట్టింది. నేను మా ఇంటి గేటు తెరిచి లోపలకు వెళ్ళాను.

అందరూ గాఢనిద్రలో వున్నారు. ఏమాత్రం అలికిడి లేదు. కాలింగ్‌బెల్ నాలుగుసార్లు కొట్టాక అప్పుడు తలుపు తెరుచుకుంది. నాన్న తలుపు తీశారు. బహుశా నేను రానని అనుకున్నారేమో నన్ను చూసి ఆశ్చర్యపోయారు.

అమ్మ నన్ను చూడగానే చాలా ఆనందించింది.

పావుగంట సేపు కబుర్లు చెప్పుకున్నాక, నాన్న "కొద్ది సేపటిలో ఎలాగూ తెల్లవారుతుంది. అంతవరకు పడుకో. రైల్లో నిద్ర పట్టిందో, లేదో" అన్నారు.

నాకు పడుకోవాలని లేదు. కానీ నా కోసం అమ్మ, నాన్న మేలుకునే వుంటారని పడుకున్నాను.

* * *

ఉదయం ఎనిమిదింటికి నేను, నాన్న కాఫీలు తాగుతున్నాము.

నేను మా అమ్మ గురించి ప్రస్తావిస్తూ "డాక్టర్ ఆపరేషన్ ఎప్పటిలోగా చేయాలన్నారు" అని మా నాన్నని అడిగాను.

"ఎంత తొందరగా చేస్తే అంత మంచిది అన్నారు" ముక్తసరిగా బదులిచ్చారు మా నాన్న.

"అయితే ఏం చేద్దామనుకుంటున్నావు?" నేను మా నాన్నని అడిగాను.

"రెండు వారాల్లోగా మీ అమ్మకు ఆపరేషన్ చేయిద్దామనుకుంటున్నాను."

"మరి డబ్బు"

"డబ్బుదేముంది. అదే వస్తుంది. అప్పు చేస్తాను. అది కుదరకపోతే ఇంటికి తాకట్టు పెట్టడమో, అమ్మడమో చేస్తాను. మనిషి ప్రాణాలకన్నా అది విలువైనది కాదు కదా" అన్నారు.

ఆ మాటలు విన్న నాకు ఏం చేయాలో తోచ లేదు. ఈ సంభాషణ ఎవరైనా విన్నా, అది తండ్రీ కొడుకుల మధ్య జరిగిన సంభాషణ అనుకోరు.

"నాన్నా. నీ ఎదురుగా నీ కొడుకు వున్నాడనుకుంటున్నావా. లేకపోతే పరాయి వాళ్ళు వున్నారనుకుంటున్నావా. అప్పుడు నువ్వు డబ్బు అడిగినప్పుడు నేను 'కుదరదు' అన్నాను. అది నా తప్పే. చిన్నప్పుడు నేను చేసిన తప్పులను సరిదిద్దిన మీరు, నేను పెద్దయ్యాక చేసిన తప్పులను సరిదిద్దలేరా. ఆనాడే "నేను నిన్ను పోషించాను. నిన్ను డబ్బు అడిగే హక్కు నాకు వుంది అని నన్ను అడుగవచ్చు కదా" నేను కొంచెం గట్టిగానే మాట్లాడాను. నా మాటలకు మా అమ్మ కూడా వచ్చింది.

"…. నాన్నా. ఇంక ఎప్పుడూ మీరు అలా మాట్లాడవద్దు. అమ్మ ఆపరేషన్‌కు అయ్యే డబ్బు నేను పెడతాను. అమ్మకు ఆపరేషన్ అయ్యేంతవరకు నేను ఇక్కడే వుంటాను. డాక్టర్‌ను కలిసి, ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా చేయిద్దాము" మళ్ళీ నేను అన్నాను.

మా నాన్న ఆలోచనలో పడ్డారు.

నేను ఆలోచిస్తూ వుండడంతో మా ముగ్గురి మధ్య నిశ్శబ్దం నెలకొంది.

'బాధ్యత' అనేది మనిషిని వెంటాడుతూనే వుంటుంది. నా తల్లిదండ్రులు పెద్దయ్యాక వారిని పోషించవలసిన బాధ్యత నామీద వుంది. మా నాన్న నన్ను డబ్బు అడిగినప్పుడు, నాకు డబ్బు ఇవ్వవలసిన బాధ్యత వుంది. నేను 'ఇవ్వను' అని అన్నప్పుడు, మా నాన్నకు 'ఎందుకు ఇవ్వవు!' అని అడిగే హక్కు వుంది.

నేను నా బాధ్యతను విస్మరించాను. అది చాలా తప్పే. మా నాన్న తనకు వుండే హక్కును వినియోగించుకోలేదు.

"సరే. నీ ఇష్టం వచ్చినట్టు కానీయ్" అన్నారు మా నాన్న.

"ఎంత మంచి మాట అన్నావు నాన్నా. నాకు ఇప్పుడు ఎంత ఆనందంగా వుందో తెలుసా" అన్నాను నేను.

నాన్న అమ్మతో "మార్కెట్‌కు వెళ్ళి కూరగాయలు తెస్తాను. సంచీ ఇలా ఇవ్వు" అన్నారు.

అమ్మ నాన్నకు సంచీ అందించింది.

"మార్కెట్‌కు నేను వెళతానులే నాన్నా. నాకు ఈ ఊరు బాగానే తెలుసు కదా" అన్నాను నేను మా నాన్న చేతిలో సంచీని తీసుకుంటూ.

■